సాక్షి కృష్ణాజిల్లా

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాలు

జగ్గయ్యపేటలో బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రంగురంగుల పూలతో చేసిన బతుకమ్మలతో మహిళలు పూజలు చేశారు. -IIలో▸



జిల్లా జట్ల ఎంపిక

బాస్కెట్ బాల్, రైఫిల్ షూటింగ్ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను మంగళవారం ఎంపిక చేశారు. రామచంద్రాపురంలో సబ్‌జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలు జరగనున్నాయి. -IIలో▸



హరే హరే పుస్తకావిష్కరణ

ఇంద్రకీలాద్రి: పురాణపండ శ్రీనివాస్ రచించిన ఆధ్యాత్మిక గ్రంథం 'హరే హరే'ను మంగళవారం ఇంద్రకీలాద్రిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

ఎక్సైజ్ స్టేషన్‌లో కలెక్టర్ తనిఖీలు



చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని మాచవరంలో ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌లో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని, 11వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుదారుల ఫోన్లకు లాటరీ నిర్వహించే ప్రదేశం, సమయం తదితర వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా తెలపాలన్నారు. మద్యం షాపుల లాటరీని నిబంధనలు మేరకు పారదర్శకంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యాలయాల్లో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త జి.మహేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న నాలుగు బోధనేతర సిబ్బంది పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 2024–2025 విద్యా సంవత్సరానికి ఈ నెల 15వ తేదీ వరకూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా టైప్–3 కేజీబీవీల్లో ఒక అసిస్టెంట్ కుక్ పోస్టు, రెండు డే అండ్ నైట్ వాచ్ ఉమెన్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని తెలిపారు. టైప్–4 విద్యాసంస్థలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నమూనా దరఖాస్తును మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి పొందవచ్చని ఆ ప్రకటనలో సూచించారు.

టెట్‌కు 2,414 మంది హాజరు



పెడన: జిల్లాలో టెట్ పరీక్ష మూడు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం ప్రశాంతంగా జరిగింది. పెడన మండలం నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల, పెనమలూరు మండలం కానూరులో ఆయాన్(ఐఓఎన్) డిజిటల్ జోన్, కానూరు వంద అడుగుల రోడ్డులోని ఐడ్జ్(ఐడీజడ్)లో సెంటర్లల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 1,336 మందికి 1,191 మంది హాజరయ్యారు. 145 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన రెండో సెషన్ పరీక్షకు 1,337 మందికి 1,223 మంది హాజరవగా 114 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లకు కలిపి 2,673 మంది అభ్యర్థులకు 2,414 మంది పరీక్ష రాశారు. 259 మంది గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, డీఈఓ కార్యాలయం ఏడీ మనోహర్ నాయక్ పరీక్ష కేంద్రాలను తనిఖీచేశారు. నందమూరు సెంటరులో పరీక్షను చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.ఆర్.ఎస్.రెడ్డి, సెంటరు అడ్మిన్ పి.అశోక్‌కుమార్ పర్యవేక్షించారు.

దసరాకు ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దసరాను పురస్కరించుకుని విజయవాడ – శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. విజయవాడ – శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైలు (07215) ఈ నెల 9, 10, 11, 12, 14, 15, 16 తేదీల్లో రాత్రి 8 గంటలకు విజయవాడలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07216) ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి, అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడ చేరుతుంది. రెండు మార్గాల్లో ఈ రైలు ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారకపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చిపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతుంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

శ్రీపీఠే.. సురపూజితే!

- శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ
- ఇంద్రకీలాద్రిపై వైభవంగా దసరా ఉత్సవాలు
- నేడు సరస్వతీదేవిగా అమ్మవారికి విశేష అలంకరణ
- అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు



కృష్ణమ్మకు హారతులు ఇస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు శక్తుల్లో ఒక శక్తి మహాలక్ష్మీదేవి. లోక స్థితి కారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్ములుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మి సమష్టి రూపమైన శ్రీమహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ మంగళవారం భక్తులను కరుణించారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించిన అనంతరం నిత్య పూజలు చేశారు. ఆలయ ఈఓ, పోలీసు, రెవెన్యూ అధికారులు తొలి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

రూ.500 టికెట్లపై భక్తుల ఆగ్రహం

రూ.500 టికెట్ల విక్రయంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.500 క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి మూడు నుంచి నాలుగు గంటలకు పడితే రూ.300, రూ.100తో పాటు సర్వ దర్శనం గంటలోనే పూర్తవుతోందని తెలంగాణ నుంచి విచ్చేసిన భక్తులు పేర్కొన్నారు.

దుర్గమ్మ సేవలో డీజీపీ

శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు దర్శించుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈఓ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు సీఎం పర్యటన నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్ల గురించి సీపీ రాజశేఖర్‌బాబును డీజీపీ అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు.

ఆరో రోజు రూ.57.18 లక్షల ఆదాయం

ఉత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం దేవస్థానానికి రూ.57.18 లక్షల ఆదాయం వచ్చింది. రూ.500 టికెట్లతో రూ.24.13 లక్షలు, రూ.300 టికెట్లతో రూ.6.11లక్షలు, రూ.100 టికెట్లతో రూ.4.69 లక్షలు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.19.64 లక్షలు, ప్రత్యేక ఆర్జిత సేవ టికెట్ల ద్వారా రూ.1.10 లక్షలు, ఇతర సేవాల ద్వారా రూ.1.51 లక్షల మేర ఆదాయం లభించింది.



డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

నేడు మూలా నక్షత్రం

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. అత్యంత కీలకమైన అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం దుర్గమ్మను శ్రీ సరస్వతీదేవిగా అలంకరిస్తారు. అమ్మవారిని సరస్వతీదేవిగా దర్శించుకుని విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని ప్రసాదించాలని వేడుకునేందుకు అశేష భక్తజన కోటి మంగళవారం రాత్రి 11 గంటల నుంచే ఇంద్రకీలాద్రికి తరలివచ్చింది. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై రాత్రి నుంచి భక్తులను కంపార్టుమెంట్‌లోకి మళ్లించారు. బుధవారం తెల్లవారుజాము రెండు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమైంది.



నయనానందకరం



ఆదిదంపతుల నగరోత్సవ సేవ మంగళవారం సాయంత్రం నయనానందకరంగా సాగింది. మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద శ్రీ గంగ, పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య నగరోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దుర్గగుడి ఈఓ రామరావు, స్పెషల్ ఆఫీసర్ రాంచంద్రమోహన్ ఈ సేవలో పాల్గొన్నారు.



మూలా నక్షత్రం దర్శనం కోసం మంగళవారం అర్ధరాత్రి రోడ్డుపై వేచివున్న భక్తులు

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజాము 2 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం
- తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్ర నవార్చన, ప్రత్యేక చండీహోమం
- మధ్యాహ్నం 2 గంటల సమయంలో అమ్మవారికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణ
- సాయంత్రం 6.30 గంటల నుంచి అమ్మవారికి మహానివేదన, పంచహారతులు, చతుర్వేద స్వస్తి
- రాత్రి 12 గంటల వరకు అమ్మవారి దర్శనం

కాణిపాకం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మకు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం దేవస్థానం ఈఓ పట్టెం గురుప్రసాద్, అర్చకులు ఇంద్రకీలాద్రికి చేరుకోగా దుర్గగుడి అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు, డీఈఓ రత్న రాజు, ఆలయ అర్చకులకు పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని అందజేశారు. దుర్గగుడి తరఫున ఈఓ రామరావు అమ్మవారి ప్రసాదాలను కాణిపాకం దేవస్థాన అధికారులకు అందజేశారు. అన్నవరంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

అన్నవరం ఆలయం నుంచి..

అన్నవరం ఆలయ ఈఓ రామచంద్రమోహన్ దంపతులు, ఆలయ అధికారులు, అర్చకులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి దుర్గగుడి అధికారులకు పట్టు వస్త్రాలు అందజేశారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కాణిపాకం ఆలయ అధికారులు, అర్చకులు

మేమింతే.. అడ్డుకుంటే అంతే

- బందరులో రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- కరగ్రహారం మట్టిదిబ్బలను తవ్వుకుపోతున్న కూటమి నేతలు
- ట్రక్కు మట్టి రూ.2 వేల చొప్పున విక్రయిస్తూ రూ.లక్షల్లో అక్రమార్జన
- ఇప్పటికే 50 ఎకరాల్లోని పోర్టుభూముల్లో మట్టి మాయం
- మామూళ్ల మత్తులో మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు



మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో పొక్లెయిన్

కోనేరుసెంటర్(మచిలీపట్నం): జిల్లా కేంద్రమైన బందరులో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. కొండల్లా పేరుకుపోయిన మట్టి దిబ్బలను యథేచ్ఛగా తవ్వేసి సొమ్ము చేసుకుంటోంది. అదేమని ఎవరైనా అడిగినా, అడ్డొచ్చినా ట్రాక్టర్లతో తొక్కించేస్తామంటూ బెదిరిస్తోంది. అధికారుల కళ్లెదుటే మట్టిమాఫియా దందా జరుగుతున్నా అడిగేందుకు, అడ్డుకునేందుకు సాహసించే నాథుడు లేకపోవటం గమనార్హం.

మైనింగ్ మంత్రి ఇలాకాలో..

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర మైనింగ్ మంత్రిగా స్థానిక ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర బాధ్యతలు చేపట్టారు. ఆయన సొంత నియోజకవర్గంలోనే మట్టిమాఫియా దందా అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బందరు మండలంలోని చినకరగ్రహారం అడ్డాగా సాగుతున్న మట్టి మాఫియా దందాలో అటు తెలుగుతమ్ముళ్లు, ఇటు జనసేన కార్యకర్తలు కలిసి ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్నారు. పోర్టుభూముల్లోని మట్టిని అయినకాడికి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. నెల రోజులుగా మట్టి దందా జరుగుతున్నా పోర్టుభూముల వైపు కన్నెత్తి చూసిన నాథుడు లేకపోవటం గమనార్హం. దీంతో గ్రామానికి చెందిన కూటమి నేతలు కొన్ని రోజులుగా దాదాపు 50 ఎకరాల పోర్టు భూముల్లోని మట్టిని తవ్వి సుమారు 50 ట్రాక్టర్ల ద్వారా రాత్రిపూట నగరంలోకి తరలించి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకులు కలిసి సుమారు 20 ట్రాక్టర్లు కొనుగోలు చేసి మరీ మట్టి విక్రయాలు సాగిస్తున్నారంటే చినకరగ్రహారంలో మట్టి దందా ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ తతంగమంతా గ్రామ బాధ్యతలు చూస్తున్న ఓ తెలుగు తమ్ముడితో పాటు ఆ పార్టీ మాజీ నాయకులు, జనసేనకు చెందిన యువకుల కనుసన్నల్లో జరుగుతుండటం గమనార్హం. బందరు మండలంలోని గోపువానిపాలెం, మంగినపూడి, రుద్రవరం గ్రామాల్లో కూడా మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది.

రోడ్లపై రేసుగుర్రాల్లా..

కూటమి నేతల మట్టి దందాతో బందరు వాసులు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్లపై రేసుగుర్రాల్లా పరుగులు పెడుతున్న మట్టి ట్రాక్టర్ల కారణంగా ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని హడలెత్తిపోతున్నారు. చినకరగ్రహారం మీదుగా నగరంలోని అనేక ప్రాంతాలకు చీమలదండులా మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు దూసుకొస్తున్నాయి. పెద్ద పెద్ద శబ్దాలతో పాటలు పెట్టుకుని ట్రాక్టర్ డ్రైవర్లు విచ్చలవిడిగా రోడ్లపై రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చినకరగ్రహారం నుంచి రాడార్ కేంద్రం, నవీన్‌మిట్టల్ కాలనీ, చిలకలపూడి సెంటర్ మీదుగా పదుల సంఖ్యలో మట్టి ట్రాక్టర్లు చక్కర్లు కొడుతుండటంతో ఆయా ప్రాంతాల వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గతంలో ఇవే మార్గాల్లో మట్టి ట్రాక్టర్ల కింద పడి నలుగురు మృత్యువాతపడిన విషయాన్ని ప్రజలు గుర్తుచేసుకుని వణికిపోతున్నారు.

మొద్దునిద్రలో అధికారులు

మచిలీపట్నం కేంద్రంగా మట్టి మాఫియా కోట్లలో అవినీతి దందా నడుపుతుండగా సంబంధిత అధికారులు స్పందించకపోవటం నగర వాసులను విస్మయానికి గురిచేస్తోంది. అందులోనూ రాష్ట్ర మైనింగ్‌శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో ఈ తతంగం జరగటం కొసమెరుపు. ఆ మంత్రి కూడా పట్టించుకోకపోవటం మట్టి మాఫియాకు ఆయన అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వాస్తవాలేనేమో అనే భావన ప్రజల్లో కలిగేలా చేస్తోంది. నెల రోజులుగా కరగ్రహారం మీదుగా మట్టి ట్రాక్టర్లు వేలాది ట్రిప్పులను నగరంలోకి డంప్ చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు పట్టించుకోకపోవటం మరిన్ని విమర్శలకు దారి తీస్తోంది. మట్టిమాఫియాతో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది జట్టు కట్టారనే ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులతో పాటు మైనింగ్ మంత్రి మట్టి దందాపై ఉక్కుపాదం మోపి పోర్టు భూముల్లోని మట్టిని కాపాడాలని మచిలీపట్నం వాసులు కోరుకుంటున్నారు.

అభిమాన తరంగం

- జననేత వైఎస్ జగన్ రాకతో కిక్కిరిసిన మొగల్రాజపురం
- మధ్యాహ్నం 2 గంటల నుంచే ఎదురుచూసిన అభిమానులు
- అధిక సంఖ్యలో విచ్చేసి అభిమానం చాటుకున్న మహిళలు



జయప్రకాష్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో దేవినేని అవినాష్, మల్లాది విష్ణు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు అభిమానులు పోటెత్తారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో మొగల్రాజపురం చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడానికి జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు మొగల్రాజపురం వస్తున్నారని తెలుసుకున్న అభిమానులు, పార్టీ శ్రేణులు, నాయకులు మధ్యాహ్నం రెండు గంటలకే ఆ ప్రాంతానికి చేరుకున్నారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు విచ్చేశారు. అధిక సంఖ్యలో అభిమానుల తరలిరావడంతో మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్, శివాలయం ప్రాంతాలు రద్దీగా మారాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక ముందుగానే మొగల్రాజపురం పరిసరాలు కిక్కిరిసిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో అభిమానుల రద్దీ మరింత పెరిగింది. పోలీసులు అతి కష్టం మీద అభిమానులను నియంత్రించి జగన్‌మోహన్‌రెడ్డి వాహనాన్ని జయప్రకాష్ ఇంటి వరకు తీసుకెళ్లారు. జయప్రకాష్ కుటుంబ సభ్యులను పరామర్శించి తిరిగి వెళ్లే సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కారులోనే నిలబడి అభిమానులకు అభివాదం చేశారు. తమ అభిమాన నేతను చూసేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్ జగన్‌పై తమకు అభిమానం తగ్గలేదని నిరూపించారు.

పల్లె పండుగకు ఏర్పాట్లు చేయండి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలులో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడానికి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సచివాలయం నుంచి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో పంచాయతీ వారోత్సవాలపై సమీక్షించారు. జిల్లా ప్రగతిని కలెక్టర్ బాలాజీ వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో రూ.68 కోట్లతో 2,331 పనులు మంజూరు చేశామన్నారు. ఈ పనులకు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 14వ తేదీ నుంచి శంకుస్థాపనలు చేయడానికి షెడ్యూలు రూపొందించామన్నారు. చేపట్టే పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు, డ్వామా పీడీ ఎన్.వి.శివప్రసాద్ యాదవ్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, డీపీఓ జె.అరుణ, హౌసింగ్ పీడీ ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెత్త రహిత మునిసిపాల్టీలే లక్ష్యం



మచిలీపట్నంటౌన్: జిల్లాలోని మునిసిపాల్టీలను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు మునిసిపల్ కమిషనర్లు సరైన కార్యాచరణతో ముందుకు సాగాలని మునిసిపల్ పరిపాలన రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జిల్లాలోని అన్ని మునిసిపాల్టీల కమిషనర్లతో ఆయన మంగళవారం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మునిసిపాల్టీలోనూ ప్రజల నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలన్నారు. చెత్త పేరుకుపోకుండా సేంద్రియ ఎరువుల తయారీ, రీసైక్లింగ్‌కు వినియోగించినప్పుడే పట్టణాల్లో చెత్త రహితం సాధ్యమవుతుందన్నారు. ఈ-వ్యర్థాలను సేకరించి వాటిని కూడా రీసైక్లింగ్ యూనిట్లకు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఏయే మునిసిపాల్టీలు ఎలాంటి ప్రణాళిక సిద్ధం చేసింది, ఆయా మునిసిపాలిటీల్లో ఎంత మేర ఈ చెత్త వస్తుందీ తదితర అంశాలతో కూడిన వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఈ పద్ధతుల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మునిసిపాల్టీల్లో ఆస్తి, తాగునీటి పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలని సూచించారు. మునిసిపాల్టీల ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలను సకాలంలో అందిస్తూ వారి మన్ననలు పొందాలన్నారు. పలు వ్యాధులకు కారకమైన దోమల నివారణ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్.బాపిరాజు, జిల్లాలోని పలు మునిసిపాల్టీల కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ప్రత్యేకత.. శక్తిపటాలు

- డప్పులు, తీన్‌మార్ వాయిద్యాలతో ఊరేగింపు
- భక్తి పారవశ్యంలో బందరు ప్రజలు
- కోల్‌కతా తరువాత బందరులోనే శక్తిపటాల సందడి



నగరంలో శక్తిపటం ఊరేగిస్తున్న చిన్నారులు

మచిలీపట్నంటౌన్: దసరా పండుగ వచ్చిందంటే మచిలీపట్నంలో శక్తిపటాల సందడి మొదలవుతుంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం నుంచి ముగిసే వరకు నగరంలోని అన్ని పేటల్లో శక్తిపటాల ఊరేగింపు ఆబాలగోపాలం భక్తిపారవశ్యంలో పరవశిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో శక్తి అమ్మవారి చిత్రాలతో తయారుచేసిన పటాలు ఊరేగించటం ప్రత్యేకం. కోల్‌కతా కాళీకామాత పటాల తరువాత దేశంలోనే మచిలీపట్నంలోనే ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. శతాబ్ద కాలానికి పైబడి శక్తిపటాల ఊరేగింపు జరుగుతోంది. బందరువాసులు భక్తిశ్రద్ధలతో ఆ ఆచారాన్ని పాటిస్తూ వస్తున్నారు. శక్తిపటాల ఊరేగింపుతో తమకు సకల శుభాలు జరుగుతాయనేది ప్రజల ప్రగాఢ నమ్మకం. మాజీ సైనికుడు దారాసింగ్ శతాబ్దం క్రితం కోల్‌కతాలోని కాళీకామాత చిత్రాన్ని ఈడేపల్లిలో చిన్న తాటాకు పందిరిలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. ప్రస్తుతం శక్తిగుడిగా ప్రాచుర్యం పొంది అమ్మవారు భక్తుల పూజలందుకుంటోంది. నాడు శక్తిపటాల ప్రదర్శనను దారా సింగ్ పరిచయం చేయగా అది నేటికీ కొనసాగుతూనే వస్తోంది.

శక్తిపటాల తయారీ ఇలా..

నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు దేవతామూర్తుల ఆలయాల వద్ద పీటాలు ఏర్పాటు చేసుకుని శక్తిపటాలను తయారుచేస్తున్నారు. వెదురుకర్రలతో తయారుచేసిన ఫ్రేమ్‌కు ముందు వైపు కాళీకామాత చిత్రం, మరో వైపు ఆంజనేయస్వామి చిత్రాలను వేయించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. ప్రధానంగా నగరంలోని ఈడేపల్లి శక్తిగుడితో పాటు గొడుగుపేట గాయత్రీమాత ఆలయం పటాలు తొలినాళ్లలో ఊరేగించే వారు. రానురానూ నగరంలోని రుస్తుంబాద, నిజాంపేట, బలరామునిపేట తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రధానంగా పటాలను తయారుచేసి ఊరేగింపులు నిర్వహిస్తారు. శక్తిపటాన్ని శ్రీదేవి శరన్నవరాత్రి ప్రారంభ అర్ధరాత్రి అమావాస్య కావటంతో రుద్రభూమిలో పూజలు చేసిన అనంతరం నగరంలో ఊరేగింపు ప్రారంభమవుతుంది.

భక్తిశ్రద్ధలతో పటాల ఊరేగింపు

ఈ పటాలను భుజాన ఉంచుకుని ఊరేగింపులో పాల్గొనే వ్యక్తి నియమనిష్టలు పాటిస్తారు. పటాన్ని మోసే వ్యక్తి నల్లని దుస్తులతో ముఖానికి కాళీకామాత ముఖచిత్రాన్ని కరాళంగా ధరిస్తారు. ధరించే వ్యక్తి రుద్రభూమిలో తెల్లవారుజామున పూజలు చేసి శక్తిపటాన్ని ఎత్తుకుని ఉపవాస దీక్షను స్వీకరిస్తారు. ఈ వ్యక్తి ఒక చేతితో చుర కత్తి, మరో చేతితో పటాన్ని పట్టుకుని ముందుకు సాగుతారు. పటం కట్టుకునే వ్యక్తి ఉదయం నుంచి ఉపవాసం ఉండి పండ్లు, పాలు తప్ప ఆ రోజు ఏమీ భుజించరు. పటంతో ఎవరి ఇంటికి వెళ్లినా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పాటు విరాళాలు ఇస్తారు. ఇంటి ముందుకు వచ్చిన శక్తిపటానికి ఈ విధంగా పూజలు చేసి పసుపు, కుంకుమలు, కానుకలు ఇస్తే మేలు జరుగుతుందని ఇక్కడి ప్రజల విశ్వాసం. అందువల్ల ఇంటికి వచ్చిన శక్తిపటాలకు పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. కొంత మంది భక్తులైతే తమ కోర్కెలు తీరితే పటాన్ని భుజానికి ఎత్తుకుంటానని మొక్కుకోవటం రివాజు. దసరా సెలవులు కావటంతో చిన్నారులు సైతం చిన్నసైజులో అమ్మవారి శక్తిపటాలను తయారుచేసి భుజాన ఎత్తుకుని ప్రదర్శన ఇచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పలు పేటలకు చెందిన చిన్నారులు ఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు.

విజయదశమి రోజు ప్రత్యేక ప్రదర్శన..

విజయదశమి రోజు రాత్రి నగరంలోని శక్తిపటాలన్నీ నగరంలోని కోనేరుసెంటర్‌కు చేరుకుంటాయి. ఈ సందర్భంగా శమీ పూజ నిర్వహిస్తారు. వివిధ పేటల నుంచి వచ్చే శక్తిపటాలతో కోనేరుసెంటర్ కోలాహలంగా మారుతుంది. పటాల ప్రదర్శనను తిలకించేందుకు నగరంతో పాటు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారు. శక్తిపటాల వెంట వచ్చే డప్పు, తీన్‌మార్ వాయిద్యాలతో ఆ ప్రాంతం మారుమోగుతుంది. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఈ ప్రదర్శన కోలాహలంగా జరుగుతుంది.

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఉద్యోగాలు పొందిన వారితో పామర్రు ఎమ్మెల్యే

కురుమద్దాలి (పామర్రు): మండలంలోని కురుమద్దాలిలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 260 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్డీఏ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలోని కొసరాజు పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లోని రూరల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, డీ మార్ట్, ఇన్నోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టు వంటి ఐదు ప్రముఖ కంపెనీల వారు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. వీరిలో 58 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 45 మందికి ఫైనల్ కావాల్సి ఉంది. ఉద్యోగాలు పొందిన వారికి స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా నియామక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్, స్థానిక నాయకులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా నాలుగు లైన్ల రహదారి నిర్మాణం

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కన ఎమ్మెల్యే బోడే ప్రసాద్, జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో నూతనంగా నిర్మించనున్న నాలుగు లైన్ల రహదారి నిర్మాణంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జాతీయ రహదారులు, చైతన్య ప్రాజెక్టు కన్సల్టెంట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న విజయవాడ తూర్పు బైపాస్ రహదారి సమగ్ర ప్రాజెక్టు నివేదికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తొలుత ఎన్‌హెచ్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. విజయవాడ నగరంలో రాకపోకల విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కొత్తగా నాలుగు లైన్ల తూర్పు బైపాస్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి రూపకల్పన చేశామన్నారు. జిల్లాలోని ఎన్‌హెచ్-16 ఉంగుటూరు మండలం గొట్టిపాడు నుంచి ప్రారంభమై గుంటూరు జిల్లా చినకాకానిలోని కాజ గ్రామం వరకు 44 కిలోమీటర్ల రహదారి నిర్మించాల్సి ఉందన్నారు. ఇందులో కృష్ణా జిల్లాలో 26 కిలోమీటర్లు ఉందని తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి 2024-25 వార్షిక ప్రణాళికలో రూ.2,716 కోట్లను హైవే పనుల కింద కేటాయించామని చెప్పారు. వచ్చే సంవత్సరం మార్చిలోగా భూసేకరణ, టెండరు పూర్తి చేసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు.

291 ఎకరాల భూ సేకరణ..

నిర్మాణ సంస్థ కన్సల్టెంట్ మురళీ మాట్లాడుతూ.. ఈ మార్గంలో ఎనిమిది పెద్ద వంతెనలు నిర్మించాల్సి ఉందన్నారు. ఉంగుటూరు మండలం గొట్టిపాడు గ్రామం నుంచి ప్రారంభమై గన్నవరం, కంకిపాడు, పెనమలూరు మండలాల్లోని గోశాల, వణుకూరు గ్రామాల మీదుగా గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల మండలానికి ప్రవేశిస్తుందని చెప్పారు. రహదారి నిర్మాణానికి 291 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. తాత్కాలిక అంచనా ప్రకారం భూ సేకరణ తదితర అంశాలను కలుపుకుని రూ. 4596.29 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పారు. సమావేశంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవోలు పి.బాలసుబ్రహ్మణ్యం, డి సంపత్‌హేశాషారూన్, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అందరికీ సర్వదర్శనమే

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి

విజయవాడస్పోర్ట్స్: ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం తిథిని పురస్కరించుకుని బుధవారం భక్తులందరికీ సర్వదర్శనం కల్పిస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు మూడు గంటల మధ్య సీఎం చంద్రబాబు ఇంద్రకీలాద్రికి చేరుకుంటారని తెలిపారు. దసరా ఉత్సవాల నిర్వహణ ప్రత్యేక అధికారి రామచంద్రమోహన్, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావుతో కలిసి ఇంద్రకీలాద్రి మోడల్ గెస్ట్ హౌస్‌లో మంత్రి ఆనం మంగళవారం విలేకరులతో మాట్లాడారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం అత్యంత కీలకమైందన్నారు. భక్తుల రద్దీని నియంత్రించడంతో పాటు వారికి సులభతరమైన దర్శనం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలోనూ మూడు క్యూలైన్ల ద్వారా భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి భద్రతా విభాగ కార్యాలయం సూచించిన కొద్ది మంది ప్రజా ప్రతినిధులకు తప్ప మరెవరికీ అంతరాలయ దర్శన ప్రవేశం ఉండదన్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా డైనమిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా సమయానుకూలంగా నగరంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు. మూలనక్షత్రం సందర్భంగా అదనంగా 1,100 మంది పోలీసులు, 110 హోల్డింగ్ టీంలను నియమిస్తున్నామని పేర్కొన్నారు.

13 శాఖల సమన్వయంతో విజయవంతం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మూలానక్షత్రంతో పాటు మిగిలిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను 13 శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ విజయవంతం చేయనున్నట్లు మంత్రి ఆనం అన్నారు. మంగళవారం రాత్రి ఇంద్రకీలాద్రిపైకి చేరుకున్న మంత్రికి ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ప్రత్యేకాధికారి రామచంద్రమోహన్, ఈవో రామరావు తదితరులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం మీడియా పాయింట్‌కు చేరుకున్న మంత్రి మాట్లాడారు. బుధవారం వేకువజామున మూడు గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. బుధవారం అన్ని క్యూలైన్లలో ఉచితంగా దర్శనం చేసుకోవచ్చన్నారు. రూ.500, రూ.300, రూ.100 టికెట్లు ఉండవన్నారు. అదేవిధంగా సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకూ వీఐపీ దర్శనాలను రద్దు చేశామన్నారు. బుధవారం ప్రతి భక్తునికి ఒక లడ్డూను ఉచితంగా అందజేస్తామన్నారు. అమ్మవారి దర్శనానికి సంబంధించి ఐవీఆర్ఎస్ ద్వారా 3,197 మంది నుంచి అభిప్రాయాలు తీసుకోగా 91.27 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు.

హరే హరే పుస్తకావిష్కరణ..

ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద హరే హరే పుస్తకావిష్కరణ జరిగింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులతో కలిసి హరే హరే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పురాణపండ శ్రీనివాస్ రచించిన ఈ పుస్తకం ఆధ్యాత్మిక గ్రంథంగా మంత్రి ప్రశంసించారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం

కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు



పెదపారుపూడి పీఎస్‌లో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు, ముసుగులో నిందితులు

పెదపారుపూడి: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని జిల్లా ఎస్పీ గంగాధరరావు తెలిపారు. మండల కేంద్రమైన పెదపారుపూడి పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ గంగాధరరావు మంగళవారం గంజాయి స్వాధీనంపై విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెదపారుపూడి గ్రామ శివారులోని శ్మశానం వద్ద గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి సమాచారం వచ్చిందన్నారు. ఎస్ఐ సిబ్బందితో అక్కడకు వెళ్లగా 16 మంది వ్యక్తులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారని చెప్పారు. వారి నుంచి 8 కేజీల గంజాయి, 6 సెల్‌ఫోన్లు, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు వెళ్లి 10 కేజీల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి తీసుకువచ్చారన్నారు. ఈ గంజాయిని పెదపారుపూడి గ్రామంలో పంచుకుంటూ పట్టుబడ్డారని చెప్పారు. వీరిలో ఫణీంద్ర అనే వ్యక్తి బీరు బాటిళ్లు తేవటానికి వెళ్లాడని, అతని వద్ద మరో 2 కిలో గంజాయి ఉన్నట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న ఫణీంద్ర కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ నమోదు చేశామని తెలిపారు.

సీఐ, ఎస్ఐలకు రివార్డు..

గంజాయి కలిగి ఉన్న నిందితులను పట్టుకోవటంలో ప్రతిభ చూపించిన సీఐ సుభాకర్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలను అభినందించారు. ప్రత్యేకంగా రివార్డు ఇస్తామని ఎస్పీ చెప్పారు.

బాస్కెట్ బాల్, రైఫిల్ షూటింగ్ జిల్లా జట్ల ఎంపిక



బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె తదితరులు

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రామచంద్రాపురంలో జరిగే సబ్‌జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఎంపిక చేసినట్లు కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి జి.సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జట్లను ఎంపిక చేశామన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్ – 19 రైఫిల్ షూటింగ్‌కు ఎంపిక

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్ – 19 రైఫిల్ షూటింగ్ ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను తాడిగడపలోని ఎల్‌వీ గార్డెన్స్‌లో మంగళవారం ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్ – 19 కృష్ణాజిల్లా కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పీప్‌సైట్, 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఓపెన్ సైట్ విభాగాల్లో బాలబాలికలను ఎంపిక చేశామన్నారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కాకినాడ, రాజమండ్రిలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు.

అఖిల భారత బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నీ ప్రారంభం

విజయవాడస్పోర్ట్స్: అఖిల భారత సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో సత్తా చాటిన 224 మంది మెయిన్ డ్రాకు చేరుకున్నారు. మెయిన్ డ్రాను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ డిక్లేర్ చేశారు. కార్యక్రమంలో శాప్ ఎండీ గిరీషా, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ద్వారకానాథ్, అంకమ్మచౌదరి, కోశాధికారి వి.వంశీ, ఏసీఏ మాజీ కార్యదర్శి చుక్కపల్లి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా వీరాంజనేయప్రసాద్



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న ఉద్యోగులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ వీరాంజనేయప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని స్థానిక రెవెన్యూ అసోసియేషన్ భవనంలో జిల్లా వ్యాప్తంగా జరిగిన సమావేశంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుని ఎన్నికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓగా పనిచేస్తున్న సీహెచ్ వీరాంజనేయప్రసాద్‌ను జిల్లా అధ్యక్షునిగా, పెదపారుపూడి తహసీల్దార్‌గా పనిచేస్తున్న వై.రంగారావును ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర కోశాధికారి నరసింహారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎంవీ శ్యామ్‌నాథ్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు పామర్తి శ్రీనివాస్, సంఘ నాయకులు యాకూబ్, ఎంఏ బేగ్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాలు



పేట శ్రీచెన్నకేశవస్వామి వారి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జగ్గయ్యపేటఅర్బన్: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు పట్టణంలోని పలు దేవాలయాల్లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. స్థానిక శ్రీచెన్నకేశవస్వామి వారి ఆలయంలో ఈ మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు, బతుకమ్మ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చక్కా సుధాకర్, కేతవరపు వెంకట్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగికి రూ.49.20 లక్షల టోకరా

పెనమలూరు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఉద్యోగికి ఏకంగా రూ.49.20 లక్షలు టోకరా పెట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ఎస్‌బీఐలో టి.వెంకట కోటేశ్వరరావు పని చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం అతని వాట్సాప్‌కు ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. ఈ వ్యాపారంలో ఎక్కువ లాభం వస్తుందని భావించి వెంకట కోటేశ్వరరావు వారు పంపిన లింక్‌ను ఆమోదించటంతో గ్రూప్‌లో యాడ్ చేశారు. దీంతో ఆయన ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.49.20 లక్షలు పలు దఫాలుగా పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడిపై లాభం రూ.2.82 కోట్లు వచ్చిందని ఇన్‌కమ్ ట్యాక్స్ కింద 20 శాతం చెల్లించాలని సైబర్ నేరగాళ్లు ఆయనకు చెప్పారు. కనీసం 10 శాతం సొమ్ము రూ.28,26,649 చెల్లిస్తే రూ.2.82 కోట్లు విత్ డ్రా చేసుకోవచ్చని లేకుంటే సొమ్ము పోతుందన్నారు. దీంతో మోసం పోయానని గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరణంలోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో వంట మాస్టర్ దుర్మరణం
- భర్త లేని లోకంలో తానుండలేనంటూ భార్య ఆత్మహత్య
- గంటల వ్యవధిలోనే దంపతుల మృతి



ఘటనా స్థలంలో నాగరాజు మృతదేహం



కుటుంబ సభ్యులతో నాగరాజు, ఉష(ఫైల్)

మధురానగర్ (విజయవాడసెంట్రల్): రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందటంతో తట్టుకోలేక భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అయోధ్యనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మృతి చెందిన గంటల వ్యవధిలోనే భార్య కూడా ఆత్మహత్య చేసుకుని తనువు చాలించటంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయోధ్యనగర్‌కు చెందిన రాచపూడి నాగరాజు(27) ప్రసాదంపాడులోని ఓ హోటల్‌లో టిఫిన్ మాస్టర్‌గా పని చేస్తున్నారు. నాగరాజు సోమవారం సాయంత్రం 6 గంటలకు పని కోసం ద్విచక్ర వాహనంపై ప్రసాదంపాడుకు వెళ్లారు. పని ముగించుకుని మంగళవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా బీఆర్టీఎస్ రోడ్డు భానూనగర్ జంక్షన్ సమీపంలో వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నాగరాజు భార్య ఉష(20) కుటుంబ సభ్యులతో ఘటనాస్థలికి చేరుకున్నారు. నాగరాజు మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న నాగరాజు విగతజీవిగా పడి ఉండటం చూసి ఉష చలించిపోయారు.

స్థానికంగా విషాదఛాయలు

అనంతరం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఉష ఫిర్యాదు చేసి, ఆమె తల్లి చల్లా ఆదిలక్ష్మి ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి తాము ఉండే ఇంటికి వెళ్లిన ఉష తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన తల్లి ఆదిలక్ష్మి వెళ్లి చూడగా ఉష ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే స్థానికుల సహాయంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భర్త మృతి చెందిన గంటల వ్యవధిలోనే భార్య కూడా మరణించడం దంపతుల మధ్య అనుబంధాన్ని తెలియజేస్తుందని స్థానికులు తెలిపారు. ఎంతో అన్యోన్యంగా ఉండే దంపతులు గంటల వ్యవధిలోనే మృతి చెందటంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. దంపతుల మృతితో వారి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. గుణదల, అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.